# నల్లంచు తెల్లచీర

'చచ్చిన శవంలా అలా పడుకోకపోతే కాస యాక్టివ్‌గా లేచి కూర్చోరాదూ?" అంది అరుణ యశోదతో మాటలతో పొడుస్తూ.

"ఆవిడగారు చచ్చిన శవం ఎందుకైంది? విరహంలో శకుంతల్లా పోజుపెడితే" పోటు ఎక్కువచేసింది శారద.

"నా యిష్టం! కావాలంటే ప్రేమలోపడ్డ శకుంతల్లా పాటలు పాడుకుంటా! మీ రెవరు ఆక్షేపించడానికి?" అని తిరగబడింది శవంలాంటి, విరహంలోని శకుంతలా వురఫ యశోద.

"కావాలంటే ప్రసవించే శకుంతల్లా పిచ్చి కేకలెయ్యి! ఎవరొద్దన్నారు?" మరీ రెచ్చగొట్టింది అరుణ.

"ఇందాకట్నించీ చూస్తున్నా, ఎందుకమ్మా ఈ ఒక్క రోజు భాగ్యానికి అలా కరుచుకుంటారు?" సర్దిచెప్పింది రెక్కలూ, ఆలివ్ కొమ్మా లేని శాంతిదూతలా సుందరం.

సుందరం మాటలకి అంతకుముందు అరగంటై జరుగుతున్న అనధికార యుద్ధం ఆగింది. సుందరానికి తెలుసు– వాళ్ళలా ఎందుకు గొంతు చించుకొంటున్నారో.

వాళ్ళు నలుగురూ ప్రాణస్నేహితులు. నాలుగు వేర్వేరు ఊళ్ళనుండి వచ్చి, మూడేళ్ళు వుమెన్స కాలేజిలో చదివి, ది సయామీస్ క్వాడ్రుప్లెట్స (The Siamese quadruplets) అని పేరు తెచ్చుకుని, ఒకర్నొకరు జీవితంలో విడవకుండా వుందామన్న ఆశ, తమ కళ్ళెదుటే నేటితో పగిలి పోతుందని గ్రహించేక, వాళ్ళ మనసుల నైర్మల్యం కలతపడి, ప్రతి చిన్న విషయానికీ దెబ్బలాడుకో నారంభించేరు. వాళ్ళ పరీక్షలు ఐపోయేయి. అంతా చాలా బాగా రాశేరు. ఒకర్నుంచి ఒకరు దూరమైపోతున్నా మన్న బెంగా, యిక బహుశా జీవితంలో కలుసుకోలేమేమో నన్న బాధా వారి హృదయాల్ని ఇనుపచేతుల్తో పిండి చేస్తున్నాయి. వారెవరిమధ్యా ఎటువంటి అరమరికా, భేదం ఎన్నడూ లేదు. ఇతరులని ప్రేమించగల సుహృద్భావం, తమ హక్కులు మరచిపోగల టేక్టు (Tact), మరొకరి బలహీనతలఎడ సానుభూతీ అందరికీ వుండడంవల్ల వారిమధ్య స్నేహం జీవితాంతర బంధంగా నిలచిపోయింది.

నలుగురూ అందగత్తెలే. నల్ల బ్లాక్‌బోర్డుమీద నాలుగు వివిధరంగుల సుద్దముక్కలతో గీసిన గీతల్లా ఎవరి అందం వారికుంది. నలుగురూ కలుసుకున్నప్పుడు ప్రతిఒక్కరూ మరీ అందంగా కన్పిస్తారు.

ముగ్గురూ బాగా కలవారి బిడ్డలే. సవతి తల్లులూ, టీ. బీ. అన్నయ్యలూ, పీచురుగొట్టు తండ్రులూ ఎవరికీ లేరు. జీవితంలోని బాధలు తెలియకుండా, జీవితసాగరంలో అలల మీద నాట్యంచేస్తూ జీవితమంటే ఒక రాకెండ్‌రోల్ పాటగా యింతవరకూ గడిపేశారు.

రేపే ఎవరివూళ్ళకి వాళ్ళు వెళ్ళిపోవాలి. అంచేత ఆ సాయంత్రం బీచిలో సముద్రాన్ని ఆఖరుసారిగా చూస్తూ కొంతసేపు కూర్చుని, సినిమాకెళ్ళి, హాస్టలికి లేటుగా రావటానికి పూర్తి ముక్కున్న తాటకిలాంటి ఆడవార్డెన్ పెర్మిషను పొంది బైల్దేరబోతూవుంటే యీవేళ "శకుంతలచీర వాడి" అంది యశోద సుందరంతో.

సుందరం అంతకుముందు నెలనాడు నల్లంచు తెల్లనూలుచీర కొనుక్కుంది. కాటుక వాలుకన్నులా, నల్లగీత మబ్బులో యిరుక్కున్న చంద్రుడిలావున్న ఆ చీర అందరికీ ప్రాణమైపోయింది. మళ్ళీ అలాంటి చీరలు కొనుక్కుందామని మిగతా ముగ్గురూ ప్రయత్నించినా దొరకలేదు. కొన్ననాడే దాన్ని యశోద కట్టుకుని తామరపువ్వంత గులాబీపువ్వు చేత్తోపట్టుకుని ఏదో రాసుకుంటూంటే "అచ్చు శకుంతల్లా వున్నా"వంది సుందరం. నాటినుండీ ఆ చీరకి శకుంతల చీరన్న పేరొచ్చేసింది.

* * *

ఆవేళ ఆచీర కట్టుకుందామని మిగతా ముగ్గురికీ బల

మైన కోరికవున్నా, యశోదే తనకోరిక ముందు ప్రకటించడం మూలంగా, దాన్ని కట్టుకొనే హక్కు సంపాదించుకొంది.

బీచికి రాగానే యశోద చీర నలక్కుండా పక్కగా తిరిగి పడుకొని ఎడమచేయి మతడపెట్టి, అరచేతికి చెంప ఆనించి, సముద్రంలోకి దూరంగా చూస్తూవుంటే, వాళ్ళ సంభాషణల్లోకి శవాలూ, శకుంతల్లూ వచ్చేయి.

శాంతి స్థాపించేక సుందరవేఁ మళ్ళీ సంభాషణ ప్రారంభించింది. "యీ డిగ్రీ కోర్సయ్యేక ఏం చేద్దా వంటారు?"

"ఎమ్మెస్సీ చదివి అఖిలాంధ్ర ఆడపిల్లల ట్యుటోరియల్ కాలేజీ పెడదాము" అంది యశోద.

"లేకపోతే పెళ్ళిళ్ళు చేసుకుని అఖిలాంధ్ర పిల్లలులల కాంపిటీషనైనా సరే" కొత్త దెబ్బలాటకి పునాదులేసింది అరుణ.

"వద్దంటేమాత్రం పెళ్ళాడక తప్పుతుందా?" న్యాయసమ్మతమైన సందేహం వెలిబుచ్చింది శారద.

"అలాఐతే అడుగో వాడ్ని ఎవరో ఒకరు పెళ్ళాడేయండి" అంది సుందరఁ, తమవేపు కలల్లో తేలిపోతున్న కవిలా వస్తున్న సుబ్రమణ్యాన్ని చూపిస్తూ. పెళ్ళికాని అసిస్టెంటింజనిరు సుబ్రమణ్యాం అంతకు రెండునెలలముందే అక్కడకు దగ్గరలోవున్న మరోవూరు పోస్టయ్యేడు.

"మీ రూముకువెళితే మీరిలావచ్చారని తెలిసొచ్చా" క్షమార్పణ చెప్తున్నట్టు అన్నాడు సుబ్రమణ్యాం సుందరంతో వాళ్ళదగ్గర కొచ్చాక.

"అబద్ధాలాడలేని అసిస్టెంటింజనీరు - కాంక్రీటులో కవిత్వంచెప్పే కవి-మాఅన్న" అంటూ పరిచయాలు పూర్తి చేసింది సుందరం.

యశోద కెదురుగా, సుందరానికి పక్కగా కూర్చున్నాడు సుబ్రమణ్యం. సుబ్రమణ్యంకి ఎవరేనా మాట్లాడితే అడ్డురాకుండా కాశ్మీరుసమస్యకారణాలదగ్గర్నుంచికరక్కాయ అవుషధ గుణాలవరకూ వినగల ఓర్పూ, ఎవరూ ఏమీమాట్లాడకపోతే జర్మనుబాలే విశిష్టత దగ్గర్నుంచి జంగం బుల్లెమ్మ శీలంవరకూ తెలివిగా మాట్లాడగల నేర్పూ వున్నాయి. అంచేత ఏ కంపెనీలోనైనా అతను పైనవుతాడు. ఆడవాళ్ళు నలుగురూ ఏమీ మాట్లాడకపోవడం కనిపెట్టి సుబ్రమణ్యమే చాలా విషయాలు మాట్లాడేడు. అతను యశోద కెదురుగా కూర్చోవడంవల్లనైతేనేమి, ఏదోవిషయం మాట్లాడి "మీరేవంటారు?" అని అన్నప్పుడు యశోదవేపు సూటిగా చూడ్డంవల్లనైతేనేమి, ఆమే అతడి నెక్కువగా ఆకర్షించిందని ఆమెతోసహా అంతా ఫీలయ్యారు.

ఈలోగా కన్నెపిల్ల మనసులోని కోర్కెలా నిండుగా లేచేడు చంద్రుడు.

పదిమందినొక్కసారి ప్రేమించి, ఎవర్ని ఫైనల్‌గా ఎన్నుకోవడమో తెలియని కాలేజీపిల్ల మనసులా ఆరాటపడ సాగింది సముద్రం.

చిరకాలానికి ప్రియుణ్ణి చూడగలిగిన ప్రియురాలి హృదయంలా కొబ్బరిచెట్లాకులు టపటప కొట్టుకున్నాయి.

చుక్కలకళ్ళు దిష్టి తగలకుండా నన్నట్టు ఒక పల్చని మేఘం చంద్రుణ్ని కప్పేసింది. కాని అందులోనుంచే సందు చేసుకుని చూస్తున్నాడు చంద్రుడు.

సుబ్రమణ్యం మొహంమీద వెన్నెల పడకపోయినా అతని చూపుల్లతలు తనని చుట్టుకుంటున్నట్టు ఫీలయింది యశోద. అతని చూపులు పెంపుడుకుక్క ప్రేమతో కరిచి నట్టు సూదిగానూ, అతిమెత్తగానూ వున్నాయి.

"మేమంతా సినీమాకి పోదామనుకున్నాం మన్నయ్యా. నువ్వుకూడా రా రాదూ?" అని ఆహ్వానించింది సుందరం.

"అందులో హీరో ఏడవడంటే తప్పకుండా వస్తా" అన్నాడు సుబ్రమణ్యం నవ్వుతూ లేచి.

o o o

సినిమా యింటర్వెల్లులో "యిందులో హీరోకి ఏడుపే కాదు విలన్కి పాటలుకూడా వుండేట్టున్నాయ్" అని అతనన్న మాటలకి మిగతావాళ్ళంతా గొల్లుమన్నారు. సినీమాతర్వాత హాస్టలుదగ్గర వాళ్ళని దింపేక "అన్నట్టు చెప్పడం మరచిపో యాను. నాకు కొద్దిరోజులో ట్రాన్సఫరై పోవచ్చు" అన్నాడు సుబ్రమణ్యం.

"అప్పుడేనా?" ఆశ్చర్యపోయింది సుందరం.

"అంతా ఏవో పోలిటిక్సులే" సమాధానం చెప్పేడు.

"ఏ ఊరౌతుందో?" మళ్ళా సుందరవే ప్రశ్నించింది.

"ఉన్న ఊరొదిలేస్తే ఏ వూరైనా సరే యిస్తామంటు న్నారు." క్షణం నిశ్శబ్దం.

"ఏవూరు వేయించుకోమంటావ్ ?"

"ఏమో! నీ యిష్టం. మనూ రెలాగ యివ్వగుకదా! పోనీ వీళ్ళ వూళ్ళల్లో దేన్నైనా కోరుకో. ఈమెది కాకినాడ; ఈమెది విజయవాడ; ఈమెది ఏలూరు."

"ఏ వూరు వేయించుకుంటారు?" అన్న ప్రశ్న మూడు మనసుల్లో ఉవ్వెత్తున లేచి అలాగే అవ్యక్తంగా వుండిపోయింది.

♦ ♦ ♦

"......అన్నట్టు మీవూరే ట్రాన్స్‌ఫరైందిట. త్వరలో వచ్చి చార్జీ తీసుకుంటాడు. అతన్ని మీ యింటికి ఆహ్వానించమని సలహా యివ్వక్కర్లే దనుకుంటాను..." సుందరం రాసిన వుత్తరం అక్కడితో కొంతసేపు చదవడం మానేసింది యశోద. సుబ్రమణ్యం నిజంగా తనూరు కోరుకొనే వేయించుకొన్నాడా? ఐతే దేనికోసం? తన కోసమా? అసంభవం. తనలోవున్న ప్రత్యేకత లేఁవిఁటి? కాని మొదట చూసినప్పుడే తనని ప్రత్యేకించి గుర్తించాడే? ఎంచేత? ఏవిటి తన ఆధిక్యత? తనకంటె అరుణా, శారదా అందంలో గాని, చదువులోగాని, డబ్బులోగాని ఏమాత్రం తీసిపోరు. డబ్బుగురించి, చదువుగురించి సుబ్రమణ్యానికి తెలియక పోవచ్చు. కాని ఏమిచూసి తనని ఎన్నుకొన్నాడతను? జవాబు తెలుసుకోడానికి తహతహలాడింది. ఆమె క్యూరియాసిటీ పూర్తిగా రాజ్ అయింది.

○ ○ ○

ఇంగ్లీషు సినిమాలో హఠాత్తుగా హీరోయిన్ని చెంప దెబ్బకొట్టి హీరో ముద్దుపెట్టుకున్నట్టు అకస్మాత్తుగా యశోదా సుబ్రమణ్యాల పెళ్ళి నిశ్చయమైపోయింది.

"హార్టీ కంగ్రాట్యులేషన్స్... యింతకీ నే నోటి అడుగుతా చెప్తావా? నిన్ను చూసినదగ్గర్నుంచీ నీ కొంగేపట్టుకు ఎందుకు తిరుగుతున్నాడమ్మా నీకాబోయే ఆయన" ధారాళంగా అడిగేసింది యశోదని శారద, పెళ్ళికి వచ్చినప్పుడు.

"ఏమో నాకు తెలీదు" ముద్దబంతి జవాబు చెప్పింది యశోద.

"ఆమాత్రం అడక్కుండా వుంటావా? పోన్లేమ్మా మాకు చెప్పక్కర్లేదులే" అరుణ సంభాషణ తుంచేసింది.

పెళ్ళి దివ్యంగా జరిగిపోయింది. పన్నెండు హానీ మూన్లలా తిరిగిపోయింది సంవత్సరం. యశోదకి కలిగిన ప్రతి కోరికా తీర్చాడు సుబ్రమణ్యం.

ఇంద్రధనస్సు వలచి చీరెలు చింపించే డామెకి.

ఉదయారుణ కాంతిలో గడ్డిపోచ చివర మెరిసే వజ్రాన్ని తాపించి ఉంగరము చేయించేడు.

పన్నీటి సరస్సులో గులాబీ రేకుల్లో బోటుషికార్లు తిప్పేడు.

తెల్ల మేఘాల పరుపులు కుట్టించేడు.

ఇవన్నీ చాలవేమోనని___

నెలకో బెనారసుచీర కొన్నాడు.

అసలు వజ్రాల ఉంగరాలు కొన్నాడు.

గులాబీబోటు కాకపోయినా, ఆమె పెదాలంత ఎర్రగా వున్న కారుకొన్నాడు.

ఇన్నున్నా ఆమె ఏదో కొరత ఫీలౌతూవుండేది. దాని క్కారణం ఆమెని మొదట్నుంచీ వేధిస్తున్న ప్రశ్న. ఇంత వరకూ ఆమె సిగ్గు, సుబ్రమణ్యాన్ని ఆ ప్రశ్న వెయ్యనివ్వ లేదు.

ఆనాడు వారి పెళ్ళయి సమంగా సంవత్సరం. నేడన్నా ఆ ప్రశ్నకు జవాబు తెలుసుకోవాలి.

ఆవేళ అడిగేసింది_ "నేనొకటి అడుగుతా చెప్తారూ."

"ఓ !"

"మీరు మొదట్నించీ నన్ను..."

"ప్రేమించేను. లవెట్ ఫస్ట్ సైట్."

"అదికాదండి..."

"నేనిదివర కెవర్నైనా ప్రేమించే ననా ? నీ తోడు."

"మీతో సాగ లేం..."

"మీ అమ్మతోడు."

"బాబ్బాబు! ఒక్కక్షణం మాట్లాడనీయండి."

"... ..."

"మీరు నన్ను మొదట్నించీ అందర్లాగా చూళ్ళేదు కదూ ?"

"నిన్నంతా ఎలా చూస్తారో తెలీదుకాని, నేను చూసి నట్లు చూస్తేమాత్రం చంపేస్తాను."

"నన్ను..."

"నిన్నుకాదు. 'అంతా'ని."

"అదికాదండీ... అంటే... ఐ మీన్ ... మమ్మల్ని మొదట మీరు చూసినప్పుడే నన్ను ప్రత్యేకంగా... అంటే మిగతా వాళ్ళిద్దర్నీ చూసినట్లు కాకుండా... స్పెషల్గా చూశారు కదూ ?"

"నేరం ఒప్పుకుంటున్నాడు ముద్దాయి."

"ఏంచేత ?"

"ఖూనీ ఒప్పుకున్నవాడ్ని ఉరితీసి పంపించేస్తారుకాని కారణా లడగరు."

"అది కాదండీ! సరదా కడుగుతున్నా."

"... ... ..."

"అప్పుడు నాలో ఏది మిమ్మల్ని ఆకర్షించింది ?"

"... ... ..."

"చెప్పండీ" బతిమాలింది.

"... ... ..."

"బాబ్బాబూ" బుజ్జగించింది."

"నీ నల్లంచు తెల్లచీర..."